అడుగుకో గొయ్యి.. చూసి అడుగెయ్

- నడుములు విరుగుతున్నాయి
- వాహనాలు పాడవుతున్నాయి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వాహన చోదకులు


ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని గుడివాడ సర్కిల్ వద్ద గొయ్యి


భీమ్‌నగర్ డిస్పెన్సరీ ఎదురుగా సౌత్ జైలురోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి


అంబేద్కర్ సర్కిల్‌కు సమీపంలో రోడ్డు మధ్యలో గొయ్యి

అల్లిపురం: సౌత్ జైలురోడ్డా.. అమ్మో గోతులు.. నడుం విరిగిపోతుంది.. వాహనాలు పాడవుతున్నాయి అంటూ వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అడుగడుగునా గోతులతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

పెద్ద పెద్ద గోతులు..

సౌత్ జైలురోడ్డులోని భీమ్‌నగర్ వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి పడటంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు గోతుల్లో పడటంతో వాహనాలు తీవ్రంగా పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు అయితే నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. వాహనాలు గోతిలో పడటంతో అక్కడున్న నీళ్ల తుళ్లి దుస్తులు పాడవుతున్నాయని వాపోతున్నారు. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డులో కృష్ణాగార్డెన్స్‌కు వెళ్లే మలుపులోను, డాబాగార్డెన్స్ సర్కిల్ సమీపంలోను, ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని గుడివాడ గురునాథరావు సర్కిల్ వద్ద, ద్వారకా బస్ స్టేషన్ సిగ్నల్స్ వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

నడుములు విరుగుతున్నాయి..

సౌత్ జైలు రోడ్డులో వాహనం నడపాలంటేనే భయమేస్తోంది. గోతుల్లో పడి నడుములు విరుగుతున్నాయి. ఒళ్లు హూనమవుతోంది. వాహనాల పరిస్థితి అయితే చెప్పనవసరం లేదు. జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలి. – వై.నాగేశ్వరరావు, భీమ్‌నగర్

రాత్రి సమయాల్లో మరీ ఇబ్బందిగా ఉంటుంది..

రాత్రి వేళల్లో సౌత్ జైలురోడ్డులో వాహనం నడపాలంటే నరకం చూస్తున్నాం. చీకట్లో గోతులు కనపడక వాహనంతో పాటు గోతుల్లో పడిపోతున్నాం. బురద మీద పడడంతో దుస్తులు పాడవుతున్నాయి. అధికారులు స్పందించాలి. – ఎంటీజీ తిలక్, నేరెళ్లకోనేరు

నరకప్రాయం..

అంబేద్కర్ సర్కిల్ నుంచి చావులమదుం జంక్షన్ వరకు రోడ్డు మధ్యలో గోతులు, రోడ్డు పక్కన మెకానిక్ షాపులతో వాహనాలు నడపాలంటే నరకప్రాయంగా ఉంది. కనీసం జీవీఎంసీ అధికారులు గాని ట్రాఫిక్ పోలీసులు గాని పట్టించుకోవడం లేదు. – ఎల్. ప్రవీణ్‌కుమార్, అల్లిపురం

వేడుకగా శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం పూజలు ఆదివారం మూడవ రోజుకు చేరాయి. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రౌడీయిజం చలాయిస్తే కఠిన చర్యలు


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ జీడీ బాబు మాట్లాడుతూ ఇప్పటి నుంచి ఎవరైనా రౌడీయిజం, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర చర్యలను ఏ మాత్రం సహించబోమని, అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ శాఖ ప్రజల రక్షణ కోసమే పని చేస్తుందని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరింబోతున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా

మరిడిమాంబ ఆలయానికి కలశాల బహూకరణ


కలశాలు బహూకరిస్తున్న బాపూ ఆనంద్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు పరిధి కనకలదిబ్బలో వెలసిన మరిడిమాంబ అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆలయానికి 108 కలశాలను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బాపూ ఆనంద్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు బాపూ ఆనంద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీశెట్టికి సేవా పురస్కారం


భీశెట్టి గోపీకృష్ణకు డాక్టరేట్ అందిస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

అల్లిపురం: మానవసేవే మాధవ సేవ అని భావించి 2006లో జీకే ఫౌండేషన్ పేరిట ఒక సంస్థ ఏర్పాటు చేసి పేద విద్యార్థులు, క్యాన్సర్ వ్యాధి గ్రస్తులు, చిరువ్యాపారులకు ఆర్థిక సహాయం, పేదల దహన సంస్కారాల కోసం అంతిమయాత్ర వాహనం ఏర్పాటు, రక్తదాన శిబిరాల నిర్వహణ, డొక్కా సీతమ్మ ఆహారనిధి పేరిట పేదల ఆకలి తీరుస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అల్లిపురానికి చెందిన భీశెట్టి గోపీకృష్ణ (జీకే) సేవలను గుర్తించిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా జీకే ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ముగిసిన రాచపోలమాంబ ఉత్సవాలు


అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం రాచపోలమాంబ అమ్మవారి ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. గత నెల 24న ప్రారంభమైన ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అల్లిపురం, బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట, చలువతోట, నేరెళ్లకోనేరు, చెరువుగట్టు, గోవింద్‌రోడ్డు, అమ్మవారివీధి, కొబ్బరితోట, భూపేష్ నగర్ తదితర 14 గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. 2027లో అమ్మవారి ఉత్సవాలు మరింత భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో రాణించాలి


విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, సంఘం నాయకులు

మద్దిలపాలెం : యాదవ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యలో రాణించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. విశాఖ యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యాదవ విద్యార్థులకు 2025 సంవత్సరానికి ప్రతిభ పురస్కారాలు శివాజీపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అందజేశారు. యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు, ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 250 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో విద్యను అభ్యసిస్తే అభ్యున్నతి సాధిస్తారన్నారు. అనంతరం ఏయూ ఆచార్యులు శ్రీనివాసరావు నేతృత్వంలో కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ, విశాఖ యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ప్రగడ చిన్నారావు, డొక్కర శ్రీనివాసరావు, జగన్, మట్టా సత్యనారాయణ, జోగ నూకరాజు, ఆచార్య శ్రీనివాస్, రమేష్, నమ్మి వెంకట్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: 'నడక దారుణాలు' శీర్షికన సాక్షిలో వెలువడిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించారు. దీంతో పాదచారులకు నడవడానికి అవకాశం ఏర్పడింది. అయితే జనతా బజార్ ఫుట్‌పాత్‌లపై స్క్రాప్‌ను కూడా తొలగించాల్సి ఉంది. అదెప్పుడని స్థానికులు, పాదచారులు ప్రశ్నిస్తున్నారు.


వన్‌టౌన్ రహదారిలో ఫుట్‌పాత్‌పై తొలగించిన దుకాణాలు

'విశాఖ నాకు ఎంతో ఇచ్చింది'

మహారాణిపేట: విశాఖ నగరం, ఇక్కడి ప్రజలు తనను ఎంతగానో ఆదరించి అక్కున చేర్చుకున్నారని, వారి అభిమానంతోనే ఇప్పటి వరకు 130 సినిమాలకు పైగా నటించే అదృష్టం తనకి దక్కిందని వర్ధమాన సినీ నటుడు వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ అన్నారు. మిషన్ కర్షక దేవోభవ జాతీయ అధ్యక్షుడు ఆడారి కిషోర్ కుమార్ అధ్యక్షతన నగరంలోని ఒక హోటల్లో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు విషయాలు తెలిపారు. సభాధ్యక్షుడు డాక్టర్ ఆడారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ సత్య సాయి శ్రీనివాస్ అనతి కాలంలోనే విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ముఖ్య అతిథి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి, ప్రొఫెసర్ డి. సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ సత్యసాయి శ్రీనివాస్ సినీ రంగంలో స్థిరపడడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత పి. నీల తిలక్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రెసిడెంట్ నరవ ప్రకాశరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రచయిత శంకర్ నీలు భాగవతుల తదితరులు పాల్గొన్నారు.


సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుపై స్పందన

- ఏటీవోకు మెమో జారీ
- బిల్లు వెనక్కి పంపిన డీటీవో

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుల బాగోతంపై స్పందన లభించింది. దీనిపై తక్షణం వివరణ ఇవ్వాలని జిల్లా ట్రెజరీ అధికారి (డీటీవో) వై.సుధాకరరావు సీతమ్మధార అసిస్టెంట్ ట్రెజరీ అధికారి గోవిందరావుకు మెమో పంపారు. ఇదే కార్యాలయంలో ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఈశ్వర వర్మ ఎరియర్స్ బిల్లుల్లో తప్పుడు లెక్కలు చూపించినట్టు సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై ట్రెజరీ అండ్ అకౌంటెంట్ శాఖ డైరెక్టర్ మోహనరావు మౌఖిక ఆదేశాల మేరకు డీటీవో సుధాకరరావు మెమో జారీ చేశారు. అలాగే బిల్లును కూడా వెనక్కి పంపినట్టు డీటీవో వై.సుధాకరరావు ఆదివారం సాక్షికి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీటీవో కోరారు. ఈ ఘటనలో డైరెక్టర్ పేరు వాడిన బిల్లును త్వరిత గతిని పూర్తి చేయడానికి ప్రయత్నాలు జరినట్టు భోగట్టా. ఈ సంఘటనను మసిపూసి మారేడు కాయ చేయడానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నయి. గతంలో ఇలాంటి సంఘటనలో ఒక ఉద్యోగికి రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఏం జరుగుతుందో అని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

రెచ్చిపోతున్న అల్లరిమూకలు

పాత పోలీస్ స్టేషన్ వద్ద అవుట్ పోస్టు నిర్వహించాలని స్థానికుల డిమాండ్

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను కొత్త భవనంలోకి తరలించిన తర్వాత అల్లర్లు పెరిగిపోయాయి. ఆరిలోవ కాలనీ, ఆఖరి బస్టాప్, దుర్గాబజార్, పాత పోలీస్ స్టేషన్, టి.ఐ.సి.పాయింట్, ముస్తఫాకాలనీ, బాలాజీనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో అల్లరి మూకల హడావిడి పెరిగిపోయింది. వీరు తరుచూ అల్లర్లకు దిగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ స్థానంలో ఇక్కడ పోలీస్ అవుట్ పోస్టు నిర్వహిస్తే అల్లర్లు తగ్గుతాయని స్థానికులు భావిస్తున్నారు. పోలీస్ అధికారులు ఖాళీ చేసిన పాత పోలీస్ స్టేషన్‌లో అవుట్ పోస్టు ఏర్పాటు చేసి అక్కడ కొందరు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. ఇక్కడ పోలీసులు లేకపోవడంతో అల్లర్లు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఇరుకుగా ఉండటంతో విమ్స్ ఆవరణలో కొత్తగా విశాలమైన భవనం నిర్మించి గత ఏడాది డిసెంబర్ 8న అందులోకి పోలీస్ స్టేషన్‌ను తరలించారు. విశాలమైన ఆరిలోవ ప్రాంతానికి ఈ ప్రస్తుత పోలీస్ స్టేషన్ కొంత దూరంగా ఉండడంతో పోలీసుల సంచారం తగ్గిపోయింది. దీంతో అల్లరి మూకలు, గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా రోడ్లపైకే వస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ రోడ్డుపైనే బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్‌తో పెద్ద హారన్‌లు కొడుతూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్‌లో అవుట్‌పోస్టు ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందిని నియమిస్తే అల్లర్లకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు భావిస్తున్నారు. పోలీస్ అధికారులు అవుట్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఆరిలోవలో ఖాళీగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనం

వైభవంగా రుక్మిణి కల్యాణం

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, నారాయణ తీర్థం తరంగిణి సంయుక్తంగా రుక్మిణి కల్యాణాన్ని మద్దిలపాలెం కళాభారతిలో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ముందుగా విశ్వక్షేన పూజ, పుణ్యాహావచనం చేశారు. తిరుపతి నుంచి వచ్చిన కంకణాలతో స్వామికి, అమ్మవారికి కంకణధారణ చేసి భక్తులందరికీ అందించారు. అనంతరం జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు, మంత్రపుష్పం, మంగళహారతి తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన 780 మందికి పెళ్లి భోజనం పెట్టారు. అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి సుసర్ల రామ్ గోపాల్, పప్పు హనుమంతరావు, జస్టిస్ క్రిష్ణ జ్యోతి పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ప్రజలను మోసం చేయడంలో బాబు ఘనుడు

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ పూర్ణిమ


మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్. చిత్రంలో కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్


కార్పొరేటర్ పూర్ణిమను సత్కరిస్తున్న 41వ వార్డు ప్రజలు

కంచరపాలెం: వెన్నుపోటు పొడవడంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్వజమెత్తారు. 41వ వార్డు జ్ఞానాపురం పార్టీ వార్డు కార్యాలయం వద్ద ఆదివారం వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ సంయుక్త ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఈగో పాలన నడుస్తుందన్నారు. తాము అధికారంలోకి వస్తే హామీలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఏడాది పాలనలో ఆ పని చేయలేక విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చిందన్నారు. హామీలు అమలు చేయమన్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో కూటమి నేతల మోసాలు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కుంటు పడిందన్నారు. వార్డుల్లో అభివృద్ధి జాడ లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోయిన అమాయక ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిరంతర పోరాటానికి సిద్ధంగా ఉందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'కరపత్రాలు ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. కార్పొరేటర్ పూర్ణిమను వార్డు ప్రజలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రామానంద్, బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, ఎల్.కుమారి, అన్నపూర్ణ, కె.దేవి, సీహెచ్ ఈశ్వరి, పి.భవానీ, బాబ్జి, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'


అంబేద్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామా టాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ప్రదర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, కార్పొరేటర్ గంగారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. దుఃఖం, పేదరికం, హింసకు మూలాలు, వాటికి విముక్తి మార్గాలు, బుద్ధుడి సందేశం, జీవిత చరిత్ర, బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరం, అంబేద్కర్ ఆలోచనలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ఒరిజనల్ ప్రతిని బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్, బత్తుల గౌతంబాబు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి


వెన్నెలదుర్గానగర్‌లో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ : పెరిగిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు ఆదివారం ఆరిలోవ ప్రాంతంలో ర్యాలీ చేపట్టారు. సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన నాయకులు జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి వెన్నెలదుర్గానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ముందు కూటమి నాయకులు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, చార్జీలు ఎప్పుడూ పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు పక్కనపెట్టి ఏడాదిలో మూడు సార్లు విద్యుత్‌చార్జీలు పెంచి సాధారణ ప్రజలపై అధిక భారం మోపారన్నారు. బీజేపీ చెప్పినట్లు కూటమి ప్రభుత్వంలో నాయకులు చేసుకుపోయి పేదలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పెంచిన ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జిల్లా సదస్సు జరుగుతుందని, దాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాసుబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారంతో హెపటైటిస్ ముప్పు

నేడు అంతర్జాతీయ హెపటైటిస్ దినం


డాక్టర్ చలపతిరావు

మహారాణిపేట: హెపటైటిస్‌పై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధి చివరి దశకు చేరుకున్న తర్వాత వైద్యుల వద్దకు వెళ్తున్నారు. ఇందు కోసం ప్రజల్లో హెపటైటిస్‌పై అవగాహన కల్పించాలని కిమ్స్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ చలపతి రావు ఆచంట అన్నారు. జూలై 28 అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా పలు విషయాలు తెలియజేశారు. కలుషిత ఆహారం, నీటి వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. రోడ్ల పక్కన శుభ్రత లేని బండ్ల వద్ద చిరుతిండి వల్ల ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఇంటి తిండికే పరిమితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గాయని రాధకు విశాఖ చిత్ర బిరుదు ప్రదానం


గాయని రాధను విశాఖ చిత్ర బిరుదుతో సత్కరిస్తున్న సుహాసిని ఆనంద్ తదితరులు

సీతంపేట: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ నేపథ్య గాయని చిత్ర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గాయని, ఉపాధ్యాయురాలు జి.కె. రాధను విశాఖ చిత్ర బిరుదుతో సత్కరించారు. గాయని రాధకు సినీ నేపథ్య గాయని చిత్ర పేరిట బిరుదు ప్రదానం చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ సుహాసిని ఆనంద్ అన్నారు. వివిధ భాషల్లో 25 వేలకు పైగా పాటలు పాడి జాతీయ స్థాయి అవార్డు పొందిన చిత్ర పేరిట బిరుదు అందుకోవడం గొప్పవిషయమని కొనియాడారు. ఘంటసాల స్మారక కళా పీఠం అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గాంచిన విశాఖలో కళలు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు జి.కె.రాధ, విశ్వప్రసాద్, కోమలి, దేవరాజ్, సాత్విక, మనోహర్ ,శైలజ, సత్య, అనూష, రమేష్‌కుమార్, మురళీధర్ తదితరులు చిత్ర పాడిన పాటలు ఆలపించి అలరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, సంఘ సేవకుడు తోట ముకుంద్, ఉపకార్ ట్రస్టు మేనేజర్ సుధీర్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘంలో నియామకాలు


నియామక పత్రాలు అందుకున్న వారితో శ్రీనివాసరావు

సీతంపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీలో చురుగ్గా పని చేస్తున్న పలువురికి వివిధ హోదాల్లో నియామక పత్రాలు అందజేశారు. సంఘ ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి దాడి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెంలో జరిగిన సమావేశంలో కొత్తగా నియమితులైన వారి కి ముఖ్య అతిథులు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రేవు శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పోతిన పైడిరాజు, సనపల రామకృష్ణ, తన్నీరు ఉమామహేశ్వర రావు, జాతీయ కార్యదర్శిగా కిలపర్తి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శిగా బగాది శ్యామల, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోతిన ప్రసాద్, ఉత్తరాంధ్ర జోన్ మీడియా కో ఆర్డినేటర్‌గా కొత్తల అరుణ్ ప్రసాద్ నియామక పత్రాలు అందుకున్నారు.